

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 25.07.2026 | సంపుటి: 3 | సంచిక: 173 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 25.07.2026 | V0LUME : 3 | ISSUE : 173 | PAGES: 8 | COST: 2/- |

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



## ప్రైవేటు సంస్థలకు దీటుగా రాణించాలి

- సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతు
- రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి విస్తరించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- మణుగూరు ఓసీ, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పరిశీలన

కొత్తగూడెం, జూలై 24 : సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సింగరేణి



## భద్రాద్రిలో 1870 మెగావాట్ల ఉత్పత్తిని ఆపేశారు

- ఉచిత కరెంటు ఇస్తే ఆదాయం రాదనే భయం
- నారుమళ్ల సమయంలో కరెంటు కోతలు పెట్టడమేంటి?
- నీళ్లు లేక మహిళలు బిందెలు మోస్తున్నారు
- సోలేపేట సబ్‌స్టేషన్‌ను తనిఖీ సందర్భంగా హరీష్‌రావు

2

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం





- విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు
- డ్రగ్స్ నిర్మూలనకు కొత్త నిబంధనల రూపకల్పనకు సీఎం ఆదేశాలు
- క్యాంపస్‌లో ఘటనలు జరిగితే యాజమాన్యాలదే పూర్తి బాధ్యత
- టోల్‌ఫ్రీ నంబర్లు, క్యూఆర్ కోడ్‌లతో గోప్య ఫిర్యాదుల వ్యవస్థ
- డీ-అడిక్షన్, కౌన్సెలింగ్, కఠిన శిక్షలతో త్రిస్థాయి కార్యాచరణ
- అవసరమైతే కొత్త చట్టం తీసుకురావాలని అధికారులకు సూచన

హైదరాబాద్, జూలై 24: రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనను అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న ప్రభుత్వం, డ్రగ్స్ వ్యాప్తిని పూర్తిగా అరికట్టేందుకు మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, ముఖ్యంగా విద్యాసంస్థలను డ్రగ్స్ ప్రభావం నుంచి కాపాడేందుకు యాజమాన్యాలకే పూర్తి బాధ్యతలు అప్పగించే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

**విద్యాసంస్థలపై పూర్తి బాధ్యత**

విద్యాసంస్థల ప్రాంగణంలో డ్రగ్స్‌కు సంబంధించిన ఏ ఘటన జరిగినా సంబంధిత యాజమాన్యాన్నే బాధ్యులుగా పరిగణించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అధికారాలతో పాటు స్పష్టమైన బాధ్యతలు కూడా యాజమాన్యాలకు అప్పగించాలని సూచించారు. అలాగే క్యాంపస్ వెలుపల అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించే వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ముందుగానే గుర్తించేందుకు ప్రతి విద్యాసంస్థలో

మిగతా 2వ పేజీలో..

## ట్రాఫిక్‌కు ప్రత్యేక బ్యూరో

- రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- ట్రాఫిక్ నిర్వహణ కోసం ప్రత్యేక బ్యూరో ఏర్పాటుకు ఆదేశాలు
- ఓఆర్ఆర్‌పై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశం
- హైదరాబాద్‌లో స్మార్ట్ సిగ్నలింగ్, సిగ్నల్ ఫ్రీ కారిడార్లపై దృష్టి

2

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



- ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు
- పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
- క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష

2

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

- వరుసగా ఐదో రోజూ కొనసాగని సభ
- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్

4





## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

- కాలిఫోర్నియా పర్యటనలో మంత్రి సీతక్క పిలుపు

3



## సైబర్ నేరాల కట్టడికి సాంకేతికత ఆధారిత పోలీసింగ్

- సైబర్ భద్రతా ప్రమాణాల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలి
- సైబర్ సెక్యూరిటీపై వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ ఆనంద్

3

## కాళేశ్వరం నిర్వహణపై కేంద్రానికి లేఖ రాయాలి



- జల్ శక్తి శాఖ, ఎన్‌డీఎస్‌ఏ నుంచి సాంకేతిక మార్గదర్శకాలు కోరాలి
- పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం
- అధికారులకు మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 24: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తన అధ్యక్షతన కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణ, పాలమూరు

మిగతా 3వ పేజీలో..

## మోదీజీ మీరు పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నారు!

- నవతరం స్వరం మారుతోంది
- యువతరంతో పెట్టుకోవద్దు
- హక్కుల కోసం పోరాడే వారిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు
- సీబీఐ, ఈడీలకు యువతరం భయపడదు
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో కేటీఆర్




హైదరాబాద్, జూలై 24: మోడీజీ మీరు పెట్టుకోకూడని వారి తో పెట్టుకున్నారు, యువ తరంతో పెట్టుకున్నారు. మోడీ గారు జాగ్రత్త పడండి. స్వరం మారుతున్నది రాజ్యం ఉలిక్కి పడాలని కేటీఆర్

మిగతా 3వ పేజీలో..

## జెన్ జీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నిలదీయండి

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్నీ పేపర్ లీకులే
- ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో టెన్త్ తెలుగు, హిందీ పేపర్ లీక్
- మరి ఆనాడెందుకు రాజీనామా చేయలేదు?
- విద్యార్థుల ముసుగులో కమ్యూనల్, కమ్యూనిస్టు శక్తులు
- ధర్నా చౌక్ ఎత్తేసినోడే ధర్నా చౌక్ దగ్గర ధర్నా చేయడమా?
- కేటీఆర్ నిర్వాకంతో 27మంది చనిపోతే చర్యలేవి?
- మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి సంజయ్



హైదరాబాద్, జూలై 24 : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో, రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ల పాలనలో పరీక్షా పత్రాలు లీకయ్యాయని, మరి ఆనాడు కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. బీజేపీ

మిగతా 2వ పేజీలో..




## ఆరోగ్య శాఖకు ₹740 కోట్లు విడుదల!

- 1,569 కొత్త సబ్ సెంటర్ల నిర్మాణం
- పల్లెల్లోనే ఉచిత నిర్ధారణ పరీక్షలు
- గ్రామీణ వైద్యానికి మహర్దశ

హైదరాబాద్, జూలై 24: తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక వైద్య రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు ₹740 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప

మిగతా 3వ పేజీలో..

## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

- వారందరికి కెటిఆర్ రూ.2 కోట్ల చొప్పన చెల్లించాలి
- బర్త్‌డే రోజయినా అబద్దాలు మాట్లడకుండా ఉండలేడు
- మీడియా సమావేశంలో మండిపడ్డ పిసిసి చీఫ్



3

## ఎన్టీఏలో భారీ ప్రక్షాళన

- నీట్ వివాదం తర్వాత పరీక్షల నిర్వహణలో సమూల మార్పులకు కేంద్రం సిద్ధం
- ఎన్టీఏలో 47 మంది అధికారుల తొలగింపు
- పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంపుపై కేంద్రం దృష్టి
- అవుట్‌సోర్సింగ్ విధానంలో సమూల మార్పులకు కసరత్తు
- ప్రశ్నాపత్రాల భద్రతకు కొత్త వ్యవస్థ అమలు చేసే యోచన

2

# ట్రాఫిక్‌కు ప్రత్యేక బ్యూరో

**హైదరాబాద్, జూలై 24:**

రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు రోడ్డు భద్రతను బలోపేతం చేయడానికి ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ వ్యవస్థపై సమగ్ర అధ్యయనం చేసి సంస్థాగత నిర్మాణంతో కూడిన ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత చర్యలను పర్యవేక్షించాలని సూచించారు.

**క్రమబద్ధీకరణపైనే ప్రధాన దృష్టి**

ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనల అమలుకంటే క్రమబద్ధీకరణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, వాతావరణ పరిస్థితులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని ట్రాఫిక్ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి ట్రాఫిక్ పరిస్థితులపై సమీక్షలు నిర్వహించాలని సూచించారు.

**ఓఆర్ఆర్‌పై ప్రమాదాల నివారణకు చర్యలు**

ఔటర్ రింగ్ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఆర్‌పై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, రహదారి భద్రతకు సంబంధించిన చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు.

**స్మార్ట్ ట్రాఫిక్ వ్యవస్థపై దృష్టి**

హైదరాబాద్‌లో స్మార్ట్ సిగ్నలింగ్ విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ట్రాఫిక్ అంతరాయం తగ్గించేందుకు అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించే అవకాశాలను పరిశీలించాలని, సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోకుండా సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

**గోప్య సమాచారం కోసం ప్రత్యేక వ్యవస్థ**

డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎలాంటి భయాందోళనలు లేకుండా అందించేందుకు విద్యాసంస్థల్లో టోల్‌ఫ్రీ నంబర్లు, ప్రత్యేక క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వీటి ద్వారా విద్యార్థులు, సిబ్బంది గోప్యంగా సమాచారం అందించే అవకాశాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**గుర్తింపు నుంచి శిక్ష వరకు త్రిస్థాయి ప్రణాళిక**

డ్రగ్స్ నిర్మూలనలో గుర్తించడం-మాన్పించడం-శిక్షించడం అనే త్రిస్థాయి కార్యాచరణను సమర్థంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తొలిసారి డ్రగ్స్ వినియోగిస్తూ పట్టుబడిన వారికి డీఅడిక్షన్ కేంద్రాల్లో చికిత్స, కౌన్సెలింగ్ అందించాలని, పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం కఠిన శిక్షలు అమలు చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైతే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడంపై కూడా అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

# ఎన్టీఏలో భారీ ప్రక్షాళన

**న్యూఢిల్లీ, జూలై 24:**

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో పరీక్షల నిర్వహణ వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు ప్రారంభించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో భారీ ప్రక్షాళన చేపడుతూ 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. వారిలో కొందరిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు**

వచ్చే నెల రోజుల్లో ఎన్టీఏ వ్యవస్థలో విస్తృత మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచడం, ప్రశ్నాపత్రాల లీకేజీకి ఆస్కారం లేకుండా పటిష్ఠ వ్యవస్థను రూపొందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు చెబుతున్నారు.

**అవుట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు**

ఎన్టీఏ అమలు చేస్తున్న అవుట్‌సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించే దిశగా కేంద్రం కసరత్తు చేస్తోంది. ప్రశ్నాపత్రాల తయారీ, భద్రత, రవాణా, పంపిణీ ప్రక్రియలను మరింత కట్టుదిట్టం చేసే కొత్త విధానాలను అమలు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో పేపర్ లీక్‌లకు అవకాశం లేకుండా సాంకేతిక, పరిపాలనా పరమైన భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయనున్నారు.

**నిపుణుల కమిటీతో సమీక్ష**

ఎన్టీఏ పనితీరును సమగ్రంగా సమీక్షించి, సంస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు నిపుణులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్టీఏ నీట్, జేఈఈ, సీయూఈటీతో పాటు 20కిపైగా జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఈ సంస్కరణలు దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణ విధానంపై కీలక ప్రభావం చూపనున్నాయని విద్యారంగ వర్గాలు భావిస్తున్నాయి.

# వెయ్యి కోట్ల సైబర్ మోసంపై సిట్

**హైదరాబాద్, జూలై 24:**

ఖమ్మం జిల్లాలో వెలుగుచూసిన వెయ్యి కోట్ల రూపాయల ఫైబర్ చీటింగ్, సైబర్ మోసాల కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భారీ మోసంపై దర్యాప్తు బాధ్యతలను సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అప్పగించగా, డీఎస్పీ కె.వి. మురళీధర ప్రసాద్ నేతృత్వంలోని బృందం విచారణను చేపట్టింది.

**రెండు కీలక కేసులు సిట్ ఆధీనంలోకి**

ఖమ్మం జిల్లా పరిధిలోని వి.ఎం. బంజారా, సత్తుపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను సైబర్ సెక్యూరిటీ బ్యూరో తన ఆధీనంలోకి తీసుకుంది. ఈ కేసుల ఆధారంగా కొత్తగా కేసు నమోదు చేసి విస్తృత దర్యాప్తు ప్రారంభించింది. ప్రతి వారం విచారణ పురోగతిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని డీజీపీ ఆదేశించినట్లు సమాచారం. విదేశీ సంబంధాలు, అంతర్రాష్ట్ర మనీలాండరింగ్, బ్యాంకు లావాదేవీల కోణంలోనూ విచారణ కొనసాగుతోంది.

**నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకున్న మోసం**

ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల పేరుతో నిరుద్యోగులు, అమాయకులను నమ్మించి నిందితులు భారీ మోసానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితుల పేర్లపై వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి, వాటి ఏటీఎం కార్డులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వివరాలను తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ నేరాల ద్వారా సమకూరిన రూ.1,000 కోట్లకు పైగా నిధులను ఈ ఖాతాల ద్వారా బదిలీ చేసినట్లు విచారణలో తేలినట్లు అధికారులు వెల్లడించారు.

**నిందితుల నెట్‌వర్క్‌పై ప్రత్యేక నిఘా**

ఈ కేసులో పోత్రు ప్రవీణ్ ప్రధాన నిందితుడిగా గుర్తించిన అధికారులు, పొత్రు కళ్యాణ్, మోరంపూడి చెన్నకేశవరావు, జన్నునూరి శివకృష్ణ, ఉడుతనేని వికాస్ తదితరులను కూడా నిందితులుగా చేర్చారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులకు సహకరించిన వ్యక్తులు, బోగస్ కంపెనీలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్ పాత్రపైనా సిట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ ఈ భారీ సైబర్ మోసానికి సంబంధించిన మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**హైదరాబాద్, జూలై 24:**



నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఏకాన క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బ్యూరో**

ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పూర్తి అధ్యయనంతో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ బ్యూరో సంస్థాగత నిర్మాణం చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై ఎంసీహెచఆర్‌డీలో డీజీపీ, సీఎస్‌లతో కలిసి ఆయన శుక్రవారం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ రెండు లేదా మూడు నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలని, ట్రాఫిక్ విషయంలో నిబంధనల కంటే క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. వాతావరణ మార్పులు, పనివేళలు, రద్దీ సమయాల, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం చేయాలని సూచించారు.ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఔటర్‌పై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలో సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకొచ్చేందుకు అవసరమైనచోట అండర్ పాస్, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించాలన్నారు. సాధ్యమైనంత వరకు సిగ్నల్స్ దగ్గర ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు ఉండేలా చూడాలన్నారు.

**మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై కీలక సూచనలు**

డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యా సంస్థల లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్ని బాధ్యులను చేయాలన్నారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని, విద్యాసంస్థలకు అధికారంతోపాటు బాధ్యతను అప్పగించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండన్నారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం ఈ మూడు దశలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించాలని, తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలన్నారు.

**సీఎం తొలి ఏకాదశి శుభాకాంక్షలు**

రేపు (25వ తేదీ) తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢంలో వచ్చే ఏకాదశిని ఏడాదిలో వచ్చే పండుగలకు ఇదే మొదటి పండుగగా జరుపుకుంటారన్నారు. తొలి ఏకాదశి రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, సకల శుభాలు కలిగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రార్థించారు. ఇది రైతుల పండుగ అని అభివర్ణిస్తూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాతో రైతు కుటుంబాలన్నీ ఏకాదశి పండుగను ప్రతి ఇంటా ఆనందంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# భద్రాద్రిలో 1870 మెగావాట్ల ఉత్పత్తిని ఆపేశారు

**ఆలేరు, జూలై 24:**

ఆలేరు నియోజకవర్గం, బొమ్మలరామారం మండలంలోని సోలేపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత వున్నారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ లాగ్ బుక్ ను చెక్ చేసి, రైతులకు రోజుకు ఎన్ని గంటల కరెంట్ సప్లై చేస్తున్నారనే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాలో పూర్తిగా ఫెయిల్ అయిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిరోజూ రైతులకు అంతరాయం లేకుండా 24 గంటల విద్యుత్, ఇంటింటికీ తాగునీరు, పొలాలకు సాగునీరు అందించింది. బొమ్మలరామారంలో చనిపోయిన బీఆర్ ఎస్ కార్యకర్తను పరామర్శించడానికి వస్తే.. ఇక్కడి మహిళలు రెండు రోజులకు ఒకసారే నల్లా నీళ్లు వస్తున్నాయని తమ బాధలు చెప్పుకుంటున్నారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి లాగా కేసీఆర్ గారు మిషన్ భగీరథ ద్వారా ఐదేళ్ల పాటు రాష్ట్రమంతా నీళ్లు ఇస్తే.. ఉన్న వ్యవస్థను నడపడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు. మిషన్ భగీరథను సరిగ్గా నడిపితే ఆ పేరు బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ గారికి వస్తుందనే అక్కసుతోనే కావాలని నీళ్లు ఇవ్వడం లేదా. సంగారెడ్డి, నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్, కామారెడ్డి, యాదాద్రి, నల్గొండ, మహబూబ్ నగర్.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్ళీ బిందెలు పట్టుకుని మహిళలు రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి కనబడుతోంది. మీరు తెస్తామన్న ఆనాటి రోజులు అంటే ఇవేనా? కరెంటు కోసం, ఎరువుల కోసం రైతులు ధర్నాలు చేయడం, తరుగు తీయడమేనా మీ మార్పు. రైతులు కరెంటు కోసం ఇబ్బంది పడుతున్నారని సోదరి సునీత గారు చెబితే ఈరోజు సోలేపేట సబ్‌స్టేషన్‌కు సర్ ప్రైజ్ విజిట్‌కి వచ్చాం. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ని అడిగితే.. మొన్నటి దాకా 1415 గంటలు ఇచ్చాం సార్, ఈ వారం నుంచి కేవలం 12 గంటలే ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి అని చెబుతున్నాడు. ప్రభుత్వం ఇస్తున్న ఆ 12 గంటల కరెంటులో కూడా రెండు మూడు సార్లు ట్రిప్ అవుతోంది. 24 గంటల కరెంటుకు రైతాంగాన్ని ఎందుకు దూరం చేస్తున్నారు? కరెంటుకు మేమే పేటెంట్ అని రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతున్నారు.. మీ పేటెంట్ అంటే ఉచిత కరెంటును ఉత్త కరెంటు చేయడమేనా? నారుమళ్లు పోసుకునే, నాట్లు వేసుకునే ఈ కీలక సమయంలో నీళ్లు చాలా అవసరం. కరెంటు ఇవ్వకపోవడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా సబ్‌స్టేషన్ల ముందు రైతులు ధర్నాలు చేస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గం తిప్పర్తి మండలంలో, జగిత్యాల జిల్లా ఐలాపూర్, బాల్కొండ, కోహీర్ మండలం దిగ్వాల్, సిద్దిపేట జిల్లా కాజీపూర్, సిరిసిల్ల జిల్లా నిజామాబాద్ సబ్‌స్టేషన్ల ముందు కేసీఆర్ 23,000 మెగావాట్ల విద్యుత్ స్థాపిత సామర్థ్యంతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టారు. ఇప్పుడు రాష్ట్రంలో 15,000 మెగావాట్ల లోడు కూడా లేదు, ఎండాకాలం కూడా కాదు.. అయినా రైతులకు ఎందుకు కోతలు పెడుతున్నారు. కోతలు పెట్టడమే కాంగ్రెస్ లక్ష్యమా. ఎన్నికల ముందు 4000 పెన్షన్, 15000 రైతుబంధు, మహిళలకు 2500, విద్యార్థి భరోసా అంటూ మాటల కోతలు కోశారు. ఇప్పుడేమో కరెంటు, బోనస్, కేసీఆర్ కిట్, గొర్రెలు,చేపల పంపిణీ, రైతు బీమాలలో కోతలు పెడుతున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మొన్న వరంగల్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంట్ కోతలే లేవని చెప్పారు. మరి ఈరోజు నేను సోలేపేట సబ్‌స్టేషన్ రికార్డులు చూస్తే 12 గంటల కరెంటే ఇస్తున్నారు.. భట్టి గారు దీనికి ఏం సమాధానం చెబుతారు. రాష్ట్రంలో 1011 గంటల కరెంటే వస్తోంది. మీ మాటలు గడప దాటుతున్నాయి కానీ మీ పనులు గడప దాటడం లేదు. మీరు నిజంగా కడుపు నిండా 24 గంటల కరెంటు ఇస్తే రైతులు ఎందుకు సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు చేస్తారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల, బొగ్గు నిల్వలు లేకపోవడం వల్ల కేసీఆర్ గారు నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 1600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు మూతపడి నెలలు గడుస్తోంది. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కూడా 270 మెగావాట్ల యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. సింగరేణి మన చేతిలోనే ఉన్నప్పటికీ 1870 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఎందుకు ఆగిపోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలి. రైతులకు ఫ్రీ కరెంటు ఇస్తే పైసలు రావని, కరెంటు ఉత్పత్తి ఆపేసి రైతులకు కోతలు పెడుతున్నారా? కరెంటు లేక కాదు.. రేవంత్ రెడ్డికి మనసు లేక కరెంటు రావడం లేదు. రైతులకు మూడు గంటల కరెంటు చాలని గతంలో రేవంత్ రెడ్డి అన్నారు, ఇప్పుడు ఆ మాటనే నిజం చేయదలుచుకున్నారా? హైదరాబాద్ ప్రజలకు ఎలాగైతే 24 గంటల కరెంటు వస్తుందో, బాయికాడ రైతుకు కూడా 24 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలన్నదే బీఆర్ఎస్ పాలసీ. బీఆర్ఎస్ ముల్లు గర్రతో పొడిస్తే తప్ప ఈ ప్రభుత్వం కదలడం లేదు. దేవాదుల మోటార్లు ఆన్ చేయాలని మేము ప్రశ్నిస్తే తప్ప, నిద్రలేచి 5 నుంచి 9 మోటార్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు మళ్ళీ చెబుతున్నాం.. యాదాద్రి, భద్రాద్రిలో ఆగిపోయిన 1870 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని వెంటనే ప్రారంభించి, రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి. కరువు పరిస్థితుల్లో బోర్లు అడుగంటిపోయినప్పుడు రైతులకు కరెంటు అవసరం చాలా ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా మిషన్ భగీరథపై వెంటనే రివ్యూ చేసి, ప్రతిరోజూ ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాం.మండలంలో వ్యవసాయ అధికారిని అడిగితే ఒక్క బొమ్మలరామారం మండలంలోనే 10 రైతు బీమాలు పెండింగ్ ఉన్నాయని చెప్పారు. దురదృష్టవశాత్తు రైతు చనిపోతే వారం రోజుల్లో 5 లక్షలు ఇచ్చేలా కేసీఆర్ రైతు బీమా తెస్తే.. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా 4000 మంది రైతులకు బీమా డబ్బులు ఐదు నెలలుగా రావడం లేదు. రైతుబంధు ఎగ్గొట్టారు, యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ సగం ఎగ్గొట్టారు..

# జెన్ జీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలను నిలదీయండి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధులు సీహెచ్. విఠల్, జె.సంగప్ప తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జెన్ జీ తరం పిల్లల్లారా.. బీఆర్ఎస్ అంటేనే పేపర్ లీకేజీలు, ప్రశ్నాపత్రాలు అమ్ముకుని దోచుకున్నరు.. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలోనూ అదే జరిగింది. ఆ రెండు పార్టీలను నిలదీయండి అని పిలుపునిచ్చారు. నిరసనలు, ధర్నాలను నిషేధిస్తూ ధర్నా చౌక్‌నే ఎత్తేసిన బీఆర్ఎస్ నేతలు ఇయాల సిగ్గు లేకుండా అదే ధర్నా చౌక్‌లో నిరసన చేశారని ఎద్దేవా చేశారు. దిల్లీలో కాక్రోచ్ పార్టీ పేరుతో జరిగిన నిరసనలో కమ్యూనిస్టు, కమ్యూనల్ పార్టీలు చొరబడి హింసను సృష్టించడమే కాక పార్లమెంటుపై దాడికి యత్నించాయని మండిపడ్డారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశం.. అందరి కంటే ఎక్కువగా ప్రధాని మోదీ బాధపడుతున్నారని చెప్పారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారని, సీబీఐ ఇప్పటికే 11మంది ఫ్యాకల్టీసహా 17 మందిని అరెస్టు చేసిందని తెలిపారు. విద్యార్థులు ఆందోళనను అర్థం చేసుకున్నాం.. విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రదాన్ క్షమాపణ చెప్పారు.. విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా 40 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించామని వివరించారు. దిల్లీలో జరిగిన ఆందోళనలో పోలీసులు, జర్నలిస్టులు, మహిళా జర్నలిస్టులపై దాడులతో ఆందోళనకారులు అసభ్యంగా ప్రవర్తించారని, పోలీసుల తలలు పగిలినా ఫైరింగ్ చేయలేదని చెప్పారు. 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని, విధి లేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరి లాఠీఛా□ర్జి చేయాల్సి వచ్చిందని అన్నారు. పాకిస్తాన్ నుండి సోషల్ మీడియా ద్వారా విష ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని, అందుకే పాకిస్తాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను కేంద్రం బ్లాక్ చేసిందని చెప్పారు. నీట్‌కు.. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధం ఏమిటి? నీట్‌కు ఆజాద్ కాశ్మీర్‌కు సంబంధం ఏమిటి.. నీట్‌కు బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంకకు సంబంధం ఏమిటి అని సంజు పశ్నించారు. విపక్షాలు పార్లమెంటులో ఎందుకు చర్చలకు సిద్ధంగా లేవని నిలదీశారు. నీట్ పేపర్ లీకై రెండు నెలలు దాటినా కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఏనాడూ పెదవి విప్పలేదని, కాక్రోచ్ పార్టీ ధర్నాలతో మొన్న అకస్మాత్తుగా పీఎం ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ కుట్ర చేసిందని అన్నారు.. మోదీని దించి రాహుల్‌ను పీఎం చేయాలన్నదే వాళ్ల ఏకైక లక్ష్యమని వ్యాఖ్యానించారు. యూపీఏ హయాంలో 72 సార్లు పేపర్లు లీకైనయ్.. మరి ఆనాడు మన్మోహన్ సింగ్, విద్యాశాఖ మంత్రి ఎందుకు రాజీనామా చేయలేదు.. ఇక రాజస్తాన్, పంజాబ్, కేరళ, కర్నాటక, య□పీ, బెంగాల్‌లలో ప్రశ్న పత్రాలు లీక్ అయితే ఆయా బాధ్యులు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. అశోక్ గెహ్లాట్ సీఎంగా ఉండగా 18సార్లు పేపర్లు లీక్ అయితే ఆనాడు రాహుల్ , ప్రియాంక ఏమన్నారో దేశమంతా చూసిందంటూ కాంగ్రెస్ చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే వ్యభిచారమా అని అడిగారు. తాను రాష్ట్రంలో గ్రూప్1 పేపర్ లీక్‌పై పోరాటం చేస్తుంటే ఏమైందో మీరే చూశారన్నారు. కాగా, కేటీఆర్‌కు 50వ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ కనీసం పుట్టిన రోజున కూడా నిజాలు చెప్పలేదని ఎద్దేవా చేశారు. ట్విట్టర్ టిల్లు బినామీ సంస్థ గ్లోబరీనా నిర్వాకం వల్ల 27మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే కనికరం లేకుండా వాళ్ల తల్లిదండ్రులపై లాఠీఛార్జి చేయించిన ఘటన మర్చిపోగలమా అన్నారు.అపుడు ఎందుకు రాజీనామా చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. పేపర్ లీక్‌పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు సుద్దపూసను తలపిస్తున్నాయని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలోనే టెన్త్ తెలుగు, హిందీ పేపర్ లీకైందని, గ్రూప్1లో అక్రమాలు జరిగి నాలుగు లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తు నాశనమైందని, మరి ఆనాడు మీరెందుకు రాజీనామా చేయలేదని నిలదీశారు. మొన్న 'నీట్'లో ర్యాంకులు సాధించిన గురుకుల విద్యార్థులందరినీ పిలిచి సన్మానం చేసినవ్.. వారిని అడుగు.. 'నీట' ఎట్లా జరిగిందో చెబుతారన్నారు. గ్లోబరీనా గురించి మాట్లాడుతున్న సీఎం ఆ నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదన్నారు. విద్యార్థులారా కుటిల రాజకీయ నేతల ట్రాప్‌లో పడకండి.. మెడికల్ కౌన్సెలింగ్‌కు సిద్ధం కండి అని పిలుపునిచ్చారు.

# ప్రైవేటు సంస్థలకు దీటుగా రాణించాలి

**మొదటిపేజీ తరువాయి**

అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. అంతకుముందు మణుగూరు ఓపెన్ కాస్ట్ మైనింగ్ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గనిలోకి వెళ్లి బొగ్గును స్వయంగా చేతిలోకి తీసుకుని దాని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడంతో సంస్థవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు సంతోషంగా సంబరాలు జరుపుకున్నారని ఉప ముఖ్యమంత్రికి అధికారులు చెప్పారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా ఆయన పరిశీలించి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్న బొగ్గు వివరాలను, భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టు 4X270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిదని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని, నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీంతో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా సునిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు శుద్ధీకరణను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో బ్లెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేకపోయిందని ఆరోపించారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదన్నారు. వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. సింగరేణి అనేది ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదు.. వేలాదిమంది కార్మిక కుటుంబాల జీవితమని అన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని అన్నారు. ప్రతి గని స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో చర్చలు ప్రారంభించాలని, సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరినీ భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అదేవిధంగా, సంస్థ భవిష్యత్తు అవసరాలు, ఉత్పత్తి లక్ష్యాల దృష్ట్యా పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ ను కూడా సింగరేణికే కేటాయించేలా ప్రభుత్వం చొరవ చూపాలని అధికారులు ఉప ముఖ్యమంత్రికి కోరారు. సెమీకండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని చెప్పారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని అన్నారు. ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు. ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే పదేళ్ల రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచనలు చేశారు. కార్పొరేట్ సంస్థల మాదిరి టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తిచేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## సైబర్ నేరాల కట్టడికి సాంకేతికత ఆధారిత పోలీసింగ్

**హైదరాబాద్, జూలై 24:**

పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే తెలంగాణ పోలీసులు సాంకేతికతలో ఎప్పటికప్పుడు ముందుండాలని డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సైబర్ భద్రత ప్రమాణాల్లో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరిచి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించేలా అన్ని పోలీసు యూనిట్లు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. గురువారం రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, సైబర్ సెక్యూరిటీ, ఈజీరో ఎఫ్ఐఆర్ క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాన మంత్రి ప్రగతి వేదిక ద్వారా దేశవ్యాప్తంగా కీలక ప్రాజెక్టులు, పాలనకు సంబంధించిన కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ మోసాలు, ముఖ్యంగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ రాష్ట్రాల సైబర్ భద్రత పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తోందని డీజీపీ తెలిపారు. మొత్తం తొమ్మిది కీలక పనితీరు సూచికల ఆధారంగా రాష్ట్రాలకు జాతీయ ర్యాంకులు కేటాయిస్తారని, ఆ అన్ని అంశాల్లో తెలంగాణ పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేసి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించాలని సూచించారు. రాష్ట్రంలో ఈజీరో ఎఫ్ఐఆర్ వ్యవస్థ అమలు ఇంకా పూర్తిస్థాయిలో జరగాల్సి ఉందని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి యూనిట్ ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తెలంగాణ జాతీయ స్థాయిలో వెనుకబడిన విభాగాల్లో పనితీరును మరింత మెరుగుపరచాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్న డీజీపీ, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలతో పాటు ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించాలని సూచించారు. సాంకేతిక ఆధారిత దర్యాప్తు విధానాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల దర్యాప్తుతో పాటు సాధారణ పోలీసింగ్‌లో కూడా క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ను పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్, టీస్పార్క్ ఎస్పీ రూపేష్, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ సాయి శ్రీ తో పాటు రాష్ట్రంలోని వివిధ పోలీసు యూనిట్ల సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాళేశ్వరం నిర్వహణపై కేంద్రానికి లేఖ రాయాలి

**మొదటిపేజీ తరువాయి**

రంగారెడ్డి ఎత్తిపోతల పురోగతిపై శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను ఫ్రీఫ్లో(నీటి నిల్వ లేకుండా) విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాక అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని తేల్చి చెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫొటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జత చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను నీటి నిల్వకు, పంపింగ్‌కు ఎందుకు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలన్నారు. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలి అని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా ఆదేశించారు. ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, ఆ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ ఎన్‌డీఎస్ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా



ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని సమీక్ష సందర్భంగా అధికారులు వివరించారు. మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.

**అన్నారం ర్యాఫ్ట్ ఫౌండేషన్‌లోనూ సాంకేతిక సమస్యల సంకేతాలు**

సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక సమాచారం విశ్లేషణను తుది దశకు తీసుకెళ్లిందని అధికారులు తెలిపారు. అలాగే అన్నారం బ్యారేజీ ర్యాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధ్యయనాల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఈ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, మధ్య సెప్టెంబర్ నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు కూడా సిద్ధం కానున్నాయని అధికారులు తెలిపారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అదనపు సాంకేతిక విశ్లేషణలు మరో రెండు వారాల్లో పూర్తవుతాయన్నారు. అనంతరం వాటిని టెక్నికల్ ఓవర్‌సైట్ కమిటీ ముందుంచాలని మంత్రి ఆదేశించారు.

**కనిపించే నీరు ఒక్కటే ప్రామాణికం కాదు**

ప్రస్తుత వర్షాకాలంలో పంపింగ్ కార్యకలాపాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కేవలం దిగువకు నీరు ప్రవహిస్తున్నందుకే పంపింగ్ సాధ్యమవుతుందని భావించడం సరికాదని అధికారులు స్పష్టం చేశారు. పంపింగ్‌కు అవసరమైన అప్‌స్ట్రీమ్ నీటి మట్టం ప్రస్తుతం కొనసాగించే పరిస్థితి లేదని, తాత్కాలిక ఏర్పాట్లతో పంపింగ్‌కు ప్రయత్నించడం వల్ల ఫలితం లేకపోవడమే కాక బ్యారేజీల కింద ఉన్న నిర్మాణ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఒక్క అడుగు కూడా రాజకీయ ఒత్తిళ్లతో వేయం.. ప్రతి నిర్ణయం శాస్త్రీయ ఆధారాలు, ఇంజినీరింగ్ ప్రమాణాలు, నిపుణుల సిఫారసుల మీదే ఆధారపడి ఉంటుంది.. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యం' అని స్పష్టం చేశారు.

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సమీక్ష పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు. నీటి కేటాయింపులు, ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న అంశాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో ప్రస్తుతం డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రాసెసింగ్ ముందుకు సాగడం లేదని అధికారులు వివరించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ.శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

**హైదరాబాద్,జూలై24:**

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న బాపూజీ స్ఫూర్తితో ప్రవాసులు తెలంగాణ గ్రామీణాభివృద్ధికి సహకరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. కాలిఫోర్నియా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్‌లో ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. సీఎం కృషికి చేయూతగా ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు, ఉపకారవేతనాలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఢిల్లీలో సీజేపీ విద్యార్థులకు మద్దతుగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఓవర్‌సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు సందీప్ వంగల, నెమలి మాధవ, శ్రీనివాస్ రామసహాయం, గూడూరు రవీందర్ రెడ్డి, గీతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

**హైదరాబాద్, జూలై24:**

బీఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. శుక్రవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం బర్త్‌డే రోజైనా కెటిఆర్ అబద్ధాలు మాట్లాడకుండా ఉంటే మంచిదన్నారు. గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదన్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. నీట్ పేపర్ లీకైన నెలన్నరకు ఆయన నిద్రలేచారని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. 'రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు' అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్‌మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు. కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. 'గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు' అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు

## ఆరోగ్య శాఖకు ₹740 కోట్లు విడుదల!

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల మార్గదర్శకత్వంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఈ నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,569 నూతన ఆరోగ్య ఉప కేంద్రాల (సబ్ సెంటర్లు) భవన నిర్మాణాలను చేపట్టనున్నారు. అంతేకాకుండా, సాధారణ వైద్య పరీక్షల కోసం గ్రామీణ ప్రజలు ఇకపై పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఉచిత నిర్ధారణ (డయాగ్నోస్టిక్) సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రాథమిక ఆరోగ్య స్థాయిలోనే వ్యాధులను త్వరగా గుర్తించి సత్వర చికిత్స అందించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు అయ్యే వైద్య ఖర్చుల భారాన్ని ప్రభుత్వం గణనీయంగా తగ్గించనుంది. వైద్యాన్ని పేద ప్రజల హక్కుగా మారుస్తూ, పల్లెల్లో ఆరోగ్య రంగానికి ప్రజా ప్రభుత్వం కొత్త ఊపిరి పోస్తున్నది. ఈ నిధుల విడుదల ద్వారా గ్రామీణ స్థాయిలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా వైద్య సేవల అందుబాటు, నాణ్యత గణనీయంగా పెరగనున్నాయి.

## మోదీజీ మీరు పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నారు!

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. సీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు నీట్ పేపర్ల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలంటూ ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరం మారుతున్నది, నవతరం మారుతున్నది అని కేంద్రం తెలుసుకోవాలి. శ్రీలంకలో ఈ యువతరం ఉరికించి ప్రభుత్వాలను పాతరేసింది. అలాంటి యువతరంతో పెట్టుకోవద్దని ఆయన హెచ్చరించారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతరాన్ని తీవ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్తానీలు అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే విద్యార్థుల వద్దకు వెళ్లి ఇప్పటికే అనేకసార్లు చర్చలు చేసి సమస్యలు పరిష్కరించాల్సి ఉండే. ఈ యువతరం ఈ జనరేషన్ సిబిఐ, ఈడి, ఐటిలకు భయపడేది కాదు అని మోడీ తెలుసుకోవాలి.తెలంగాణ యువతతో పాటు దేశం యువత ఆగ్రహంతో ఉన్నారు. పొట్టు పొట్టు కోపంగా ఉన్నారు. నిన్ను నీ ప్రభుత్వాన్ని మెట్టు మెట్టు ఎక్కి తొక్కుతారు. ఈ విషయాన్ని మోడీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. యువతరానికి ఏ రాజకీయ నాయకుడి అండ లేదు. దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో వేలాదిమంది తరలి వస్తున్నారు. యువతరం ఆందోళన ఆగ్రహం కేవలం పేపర్ లీక్ కి సంబంధించిందే కాదు. 12 ఏళ్లుగా కేంద్రం చేస్తున్న మోసాలు, ద్రోహాల పైన ఆగ్రహం.అసలు పని చేయకుండా కేవలం మతం పేరుతో తప్పించుకుంటున్న తీరుని యువతరం అర్థం చేసుకున్నది. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ 24 కోట్ల ఉద్యోగాలు ఇయ్యలేనందుకే యువతరం ఈరోజు బయటకు వచ్చింది. మేకిన్ ఇండియా అడిగితే లీకిన్ ఇండియా బీజేపీ ఇచ్చింది. విద్యార్థులు యువతరం కేంద్రం నుంచి జవాబుదారితనాన్ని అడుగుతున్నది.

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే తప్పైందా అని యువతరం అడుగుతున్నది, నిలదీస్తున్నది. ఈరోజు చేపట్టిన నిరసనలో ఎలాంటి రాజకీయాలు లేవు. విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని చూడలేకనే ప్రజాప్రతినిధులుగా, నాయకులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటం చేసి తెలంగాణ సాధించిన ఉద్యమ పార్టీగా విద్యార్థుల ఉద్యమానికి అండగా ఉండాలనుకున్నాం. పార్టీల జెండాలు, ఎజెండాలతో వారి ఉద్యమానికి కలుషితం చేయవద్దు. కానీ వారికి అండగా ఉండాల్సిన అవసరం ఉన్నది. విద్యార్థులు ఒక్కరే కాదు వారందరికీ మనమంతా అండగా ఉన్నామని చెప్పాల్సిన అవసరం ఉన్నది. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాష్టికాన్ని అణచివేతను చూస్తే ఎవరి మనసైనా కరగాల్సిందే. వాళ్ళు అడిగిన దాంట్లో అన్యాయం ఏమున్నది? వాళ్ళు అడిగింది కేవలం తమకు న్యాయం చేయమని తమ భవిష్యత్తును కాపాడమని. యువతరం ప్రధానమంత్రి కుర్చీ అడిగిందా? కేంద్రమంత్రి కుర్చీ అడిగిందా? నీట్ పరీక్షా పత్రం పేపర్ లీక్ తో పాటు విద్యారంగంలో సంస్కరణ రావాలని సోనమ్ వాంగ్‌చుక్ నిరసనకు కూర్చున్నారు. మీడియా మద్దతు లేకున్నా సోషల్ మీడియా తోనే జెన్ జీ యువతరం దేశం మొత్తాన్ని కదిలించింది. ఇదే తెలంగాణ గడ్డ నుంచి 50 ఏళ్ల కింద జీనా హై తో మర్నాసికో కదం కదం పర్ లడ్నాసికో అని ఒక యువకుడు పిలుపునిచ్చిండు. ఆ స్ఫూర్తితో తెలంగాణ యువత, దేశ యువత గట్టిగా కొట్లాడుతున్నది. దేశంలోని ఆడబిడ్డలను పోలీసులు తీవ్రంగా దాడి చేస్తున్నారు. కొట్టకూడని చోట కొడుతున్నారు. విద్యార్థులకు యువతకు సంఘీభవంగా రాజకీయాలతో సంబంధం లేకుండా మా పార్టీ సంఘీభావం తెలిపింది ఈరోజు. విద్యార్థులు కోరుతున్నట్లుగా ధర్మేంద్ర ప్రధాన్ ని రాజీనామా చేయించాలి. విద్యార్థులపై పెట్టిన పోలీసు కేసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి. విద్యార్థులపై చేసిన దాష్టీకానికి అక్రమ కేసుల నమోదుకు క్షమాపణ చెప్పాలి. దేశంలో కేంద్ర మంత్రుల కొడుకులు రేపులు చేస్తే వెంటనే బెయిల్ వస్తున్నాయి కానీ పేపర్ లీకుల పైన ఎంత అడిగినా సమాధానం మాత్రం ఎందుకు రావడం లేదు. ఏ దేశం కోసం? ఏ ధర్మం కోసం? పేపర్ లీకుల పైన సమాధానం చెప్పడం లేదు. భారతీయ జనతా పార్టీ నాయకులు చెప్పాలి. అడగవలసిన అవసరం ఉన్నది, నిలదీయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

**మోదీ తప్పు చేశాడంటే రేవంత్‌కు ఎందుకు కోపం?**

హైదరాబాద్, ప్రజాతంత్ర, జూలై 24: మోడీ పైన నేను కొట్లాడితే రేవంత్ రెడ్డి అనే కేడీకి ఎందుకు కోపం వచ్చింది? మోడీ తప్పు చేసిండు అంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కోపం? మోడీని ప్రశ్నిస్తే యూత్ కాంగ్రెస్ ని ఎందుకు పంపించి నన్ను అడ్డుకుంటున్నాడు రేవంత్ రెడ్డి చెప్పాలి. రాహుల్ గాంధీ ఢిల్లీలో కొట్లాడితే కొడంగల్లో పోయి రేవంత్ రెడ్డి దాక్కున్నాడు. నల్లమల్ల పిల్లి వోయి కొడంగల్లో దాక్కున్నది. రేవంత్ రెడ్డి కూతురునో, మనవడినో ఢిల్లీలో పిల్లల్ని కొట్టినట్లు కొడితే రేవంత్ రెడ్డి ఊరుకుంటాడా? ఢిల్లీ దాకా వెళ్లి మీ నాయకుడితో కూర్చుండి నిరసించే ధైర్యం కూడా రేవంత్ రెడ్డికి లేదు. దేశమంతా నరేంద్ర మోడీని ధర్మేంద్ర ప్రధాన్ ని ప్రశ్నిస్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్, కేటీఆర్ ని విమర్శిస్తున్నాడు. మేము మాట్లాడుతుంటే మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నాడు రేవంత్ రెడ్డి చెప్పాలి. ఢిల్లీని వణకించి తెలంగాణ తెచ్చిన పార్టీ మాది. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి గడగడలాడించి అయినా విద్యార్థుల వెంట నిలబడతాం. నీకు ఎలాగూ ఢిల్లీని ప్రశ్నించే ధైర్యం లేదు రేవంత్ రెడ్డి. మమ్మల్ని ఎందుకు ఆపుతున్నాడో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.

## లోతుకుంట భూముల కేసులో హైడ్రాకు హైకోర్టు హెచ్చరిక

**హైదరాబాద్, జూలై 24:**

హైదరాబాద్‌లోని లోతుకుంట భూముల వివాదంపై తెలంగాణ హైకోర్టులో జరిగిన విచారణలో హైడ్రా అధికారుల తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా వ్యవహరించిన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఈ వ్యవహారంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వైఖరిపైనా ప్రశ్నలు లేవనెత్తింది. హైడ్రా తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టులో హాజరై వాదనలు వినిపించారు.

**కోర్టు ఉత్తర్వులను ఎందుకు పాటించలేదు?**

విచారణ సందర్భంగా రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు సంబంధించిన చట్టాలను పక్కనబెట్టి కేవలం హైడ్రా చట్టం ప్రకారమే వ్యవహరిస్తున్నారా అని ధర్మాసనం ప్రశ్నించింది. కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించడం హైడ్రాకు అలవాటుగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఒకే భూమికి సంబంధించిన మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లలో ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడం అసాధారణ పరిణామమని పేర్కొంది.

**ధిక్కరణపై తీవ్ర అభ్యంతరం**

కోర్టు ధిక్కరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించకుండా, అదే భూమిలోకి మళ్లీ వెళ్లడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని హైకోర్టు స్పష్టం చేసింది. కేవలం ఒక ఫిర్యాదు ఆధారంగా న్యాయస్థానం ఆదేశాలను విస్మరించి భూమిలోకి ప్రవేశించడం ఎలా సమర్థనీయమవుతుందని అధికారులను ప్రశ్నించింది.

**కమిషనర్‌కు అఫిడవిట్ ఆదేశం**

ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసేందుకు అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గడువు కోరగా, హైకోర్టు అంగీకరించింది. అయితే హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా క్షమాపణలు తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## సంపాదకీయం



# బొద్దింకలను తేలికగా తీసుకోవద్దు

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమీషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది.పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఓక ప్రేరణ మాత్రమే. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగుబాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పందించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవరమైన పనులనే చేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మాటలతో ఎంతోకాలం మభ్య పెట్టలేమని గుర్తిస్తే, బొద్దింకల బాధా ఉండదు.

# రాజీనామా చేయాల్సిందే!

- విద్యాశాఖ మంత్రి వెంటనే దిగిపోవాలి
- విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి
- కేంద్రానికి సీజేపీ కీలక అల్టిమేటం
- రెండు డిమాండ్లకు ప్రభుత్వ అంగీకారం

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీకుకు కేంద్రం బాధ్యత వహించడంతో పాటు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పట్టుబట్టింది. ఢిల్లీలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో శుక్రవారం సమావేశమైన సీజేపీ ప్రతినిధుల బృందం తమ 3 ప్రధాన డిమాండ్లను లిఖితపూర్వకంగా ప్రభుత్వం ముందుంచింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం మంత్రి రాజీనామా మినహా మరేదీ తమకు ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పింది. దాదాపు 2 గంటలపాటు జరిగిన ఈ చర్చల అనంతరం సీజేపీ జాతీయ అధికార ప్రతినిధులు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకా మీడియాతో మాట్లాడారు. తమ 3 డిమాండ్లలో రెండింటికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వారు వెల్లడించారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్లను ఉపసంహరించడానికి అంగీకరించిందని తెలిపారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల



కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌పైనా సానుకూలంగా ఉందని చెప్పారు.

### రేపటి వరకు గడువు

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశంపై రేపు మధ్యాహ్నం వరకు ప్రభుత్వం తమను సమయం కోరిందని సీజేపీ నేతలు స్పష్టం చేశారు. త్వరలోనే ఆయనను పదవి నుంచి తొలగిస్తుందని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు. నీట్ పేపర్ లీకు వ్యవహారంలో మంత్రి రాజీనామా తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని మంత్రులకు తేల్చిచెప్పామన్నారు. ఒకవేళ తమ డిమాండ్ నెరవేరకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని, ధర్మేంద్ర ప్రధాన్ వైదొలిగే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని సీజేపీ నేతలు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

# దోషులకు పదేళ్ల జైలు..పదికోట్ల జరిమానా

- చట్టంలో మార్పులకు కేంద్ర కేబినేట్ నిర్ణయం!

**న్యూఢిల్లీ,జులై 24:** పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్‌ల ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కేంద్రం కీలక సవరణలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల



వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై శుక్రవారం జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చలు జరిపారు. అనంతరం ఈ ముసాయిదా బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. ఇక, పేపర్ లీకులపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఢిల్లీ న్యాయస్థానంలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటవ్వగా.. మరో నాలుగింటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ న్యాయస్థానాల పరిధిలో.. లీకులకు సంబంధించిన కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసి దోషులకు శిక్ష విధించేలా బిల్లులో ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. వచ్చే వారం ఈ బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది. నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన ఉధృతమైన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించింది. లీకేజీ ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్వయంగా ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు.

# యువతను ఫాలో కావడం అవసరమే

### సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలి
### కేబినేట్ భేటీలో మంత్రులకు మోడీ సూచన



**న్యూఢిల్లీ,జులై 24:** యువతకు మరింతగా చేరువయ్యేందుకు కేంద్ర మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం కేబినెట్ సమావేశం సందర్భంగా మంత్రులకు ఈ మేరకు సూచించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత మంది యాక్టివ్‌గా ఉంటున్నారని ప్రధాని మోదీ మంత్రులను ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ సమయం సోషల్ మీడియాలోనే ఉంటున్నట్టు చెప్పారు. కాబట్టి ప్రభుత్వం సోషల్ మీడియా వేదికల్లో యువతకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేసినంత మాత్రాన సరిపోదని ప్రధాని మంత్రులకు చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో నేరుగా యువతతో టచ్‌లో ఉండాలని ప్రధాని సూచించారు. యువతకు మరింత దగ్గర చేసే రీల్స్ వంటి క్రియేటివ్ కంటెంట్‌ను పోస్టు చేస్తూ ఉండాలని కూడా ప్రధాని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పేపర్ లీక్ నిందితులకు కఠిన శిక్షలు విధించే ముసాయిదా చట్టంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ ఈ సూచనలు చేసినట్టు తెలుస్తోంది. ఈ బిల్లుకు కేంద్రం ఆమోదం లభించినట్టు కూడా తెలుస్తోంది. పేపర్ లీకేజీలకు పాల్పడే వారికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకూ జరిమానా విధించేలా నిబంధనలు రూపొందించినట్టు తెలుస్తోంది.

# ప్రధాన్ రాజీనామా చేసేవరకు వెనక్కి తగ్గం

### ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం
### విద్యార్థుల భవిష్యత్ కోసమే తమ ఆందోళన
### కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి

**న్యూఢిల్లీ,జులై24:** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏమీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగు తున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోబోమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చర్చల కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లబోమని.. జంతర్‌మంతర్ వద్దే



చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కఠిన చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దమనకాండను ఖండించారు. సీజేపీ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు వేల సంఖ్యలో యువకులు చేరుకుంటున్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున భద్రతాబలగాలను మోహరించారు.

# పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

### నివేదిక కోరుతూ కేంద్రం, ఎటిఎకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,జులై24:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో , పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని ఉపయోగించడంపై జస్టిస్ పి.ఎస్. నరసింహ వ్యాఖ్యానిస్తూ... ఇది ఒక తాత్కాలిక నివారణ చర్య మాత్రమే తప్ప, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాగే, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని కాపాడే డేటా రక్షణ చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది.

# నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

### వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ.. సోమవారానికి వాయిదా
### రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్

**న్యూఢిల్లీ,జూలై24:** లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగింది. నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమా[illegible]్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని [illegible] క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలావుంటే వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్ష సహా ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలనూ ఇందులో పొందుపరిచారు. అయితే.. ఈ బిల్లుపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాజ్యసభ కార్యకలాపాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

# పీర్జాదిగూడలో ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

- గిఫ్ట్ ఏ స్మైల్'లో భాగంగా ఇద్దరు విద్యార్థులకు స్కూల్ ఫీజుల చెల్లింపు.
- మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరం




**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పుట్టినరోజు పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలతో కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. ఐటీ, పారిశ్రామిక, పట్టణాభివృద్ధి రంగాల్లో తెలంగాణను దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల కల్పన, మున్సిపల్ సేవల ఆధునికీకరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ ఆదర్శనీయమని అన్నారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా సమాజ సేవకు ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తిగా కేటీఆర్ ఎన్నో సేవా కార్యక్రమాలకు ప్రేరణగా నిలిచారని, ఆయన జన్మదినాన్ని ప్రతి ఏడాది సేవా దినోత్సవంగా నిర్వహించడం బీఆర్ఎస్ కార్యకర్తల సంప్రదాయంగా మారిందని పేర్కొన్నారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన సుబ్రత్ పరిహారి, కిరణ్ కులకర్ణి కుటుంబాల ఇద్దరు విద్యార్థుల స్కూల్ ఫీజులను చెల్లించి వారి విద్యాభ్యాసానికి అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా టి ఎక్స్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వందలాది మంది ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోగా, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి,యూత్ అధ్యక్షులు పైళ్ల ప్రభాకర్ రెడ్డి (ప్రభు), మహిళా అధ్యక్షురాలు నిర్మల,నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్,శ్యామలశ్రీనివాస్, శ్యామలసాయిలు, ఆంజనేయులు, బాలరాజు కోనేటి వెంకట్, పింగళి జోగిరెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, నర్సిరెడ్డి, రాంరెడ్డి, గడీల జగన్ రెడ్డి, రాయల అశోక్, జోసెఫ్ రెడ్డి, సతీష్, బుల్లెట్ శంకర్, చిర్ర సంతోష్, పాశం నరేంద్రర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, విజయ్,మల్లం వెంకటేష్, ప్రవీణ్ రెడ్డి, సాగర్ రెడ్డి, అశోక్ రెడ్డి, నారాయణ రెడ్డి, సాయి శెట్టి, కోల శ్రీనివాస్, శంకరయ్య, సత్యం, మధు,శ్రీకాంత్, కిషోర్,డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేలకొండపల్లిలో విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

- నీట్ పేపర్ లీకేజీని ఖండిస్తూ యూత్ కాంగ్రెస్ ఆందోళన
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి జెర్రిపోతుల అంజనీ




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, నీట్ పేపర్ లీకేజీని ఖండిస్తూ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం నేలకొండపల్లి మండల కేంద్రంలో విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా కొనసాగింది నేలకొండపల్లి మండలంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. కార్యకర్తలు ఆయా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యా సంస్థలను మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బంద్ కు సంపూర్ణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ మాట్లాడుతూ, "ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వివాదానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దారుణం. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల గొంతు నొక్కుతోంది" అని తీవ్రంగా మండిపడ్డారు.అదేవిధంగా విద్యార్థుల తరపున ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. "విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలి" అని డిమాండ్ చేశారు ఈ బంద్ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ 12వ వార్డు మెంబర్ రాయపూడి రోహిత్, కొమ్మూరి నరేష్, లంజపల్లి వీరబాబు, తోట ధనుష్, కైలాసపు గోపి, గుండు మహేష్, నవీన్, విద్యార్థి నాయకులు పగిడికత్తుల నవీన్, కైలాసపు రేణు, తాత దిలీప్, భూక్య వినయ్, గోపి పందు, నవీన్, వేణు, సాయి, పెరిమల్ల నిశాంత్, తేజ, ఉదయ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నేలకొండపల్లి మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా బంద్ ప్రశాంతంగా ముగిసింది.

# కాంగ్రెస్ నిరసనలపై బీజేపీ ఆందోళన

## డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**కాప్రా, జూలై 24 (రాజ ముద్ర న్యూస్):** ఢిల్లీలోని ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన నిరసనలకు వ్యతిరేకంగా, గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ నేతృత్వంలో పిస్తా హౌస్ నుంచి రాధిక చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మాట్లాడుతూ, పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చించకుండా కాంగ్రెస్ నాయకులు ప్రధాని నివాసం వద్ద ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడానికి ప్రయత్నించిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబటి వెంకటాచలం, జి.వి.ఎన్. రావు, తుమ్మల సంధ్యారెడ్డి, శాంతికుమార్, చల్లా ప్రభాకర్, రామ్ ప్రదీప్, పెదరాల శరత్ చంద్ర, ఏనుగు రాజురెడ్డి, సందీప్ చారి, ఉమా శ్రీధర్, రోహిన్ కుమార్, సోహన్ సింగ్, కణుకుల రజనీకాంత్ రెడ్డి, దొంతుల ప్రభాకర్‌తో పాటు బీజేపీ వివిధ మోర్చాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా షిరిడీకి ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్ర బస్సు

**ఘట్‌కేసర్, జూలై 24, రాజముద్ర న్యూస్:** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని టీజీఎస్ఆర్టీసీ చెంగిచెర్ల డిపో ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్రను నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్ స్వాతి తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ షిర్డీ యాత్రలో మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శని శింగణాపూర్, షిర్డీ సాయిబాబా, నాసిక్ త్రయంబకేశ్వర్, తుల్జాపూర్ భవాని అమ్మవారి దేవాలయాల దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక యాత్ర జూలై 27, 2026న సాయంత్రం 6 గంటలకు చెంగిచెర్ల డిపో నుంచి నాన్ ఏ/సీ సూపర్ లగ్జరీ బస్సు ద్వారా ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు భక్తి, శాంతి, ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా యాత్రను రూపొందించినట్లు తెలిపారు.ఈ యాత్రకు పెద్దలకు రూ.4,000, పిల్లలకు రూ.3,000గా చార్జీలు ఉంటాయని. ఆసక్తి గల భక్తులు ముందస్తుగా తమ సీట్లను బుక్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలు, రిజర్వేషన్ కోసం 9110505820, 9000769694, 7416400228, 7993291705, 9948886516 నంబర్లను సంప్రదించాలని చెంగిచెర్ల డిపో మేనేజర్ స్వాతి కోరారు.



# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

## ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మొండల అధ్యక్షుడు రేశ్వంత్




**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** మొయినాబాద్ మండల కేంద్రంలో కనకమామిడి ప్రభుత్వ పాఠశాల, అమ్డాపూర్ ప్రభుత్వ పాఠశాల సంపూర్ణంగా బంద్ విజయవంతం చేయడం జరిగిందని ఎస్ ఎఫ్ ఐ మొయినాబాద్ మండల అధ్యక్షుడు రేశ్వంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ అవ్వడం వల్ల చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఎన్ టి ఎ రద్దు చేయాలని, విబిఎస్ఎ బిల్లు వెనక్కి తీసుకోవాలని, కేంద్రంలో కేంద్రంలో, రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల నాయకులు నవీన్, సోనూ, వికాస్, సంపత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నిదానాల కన్నా అన్నదానమే మిన్న



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** అన్నిదానాల కంటే అన్నదానమే గొప్పదని 14వ వార్డు కౌన్సిలర్ గాలి సాయికిరణ్ అన్నారు. శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ కింద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆకలితో ఉన్న వారికి భోజనం పెట్టడం గొప్ప పుణ్యకార్యమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాయల్ డిజిటల్ ఎక్స్‌రే సెంటర్ ప్రారంభం



**సూర్యాపేట:రాజముద్ర న్యూస్:** అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన రాయల్ డిజిటల్ ఎక్స్‌రే సెంటర్ ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి శుక్రవారం సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు ఈ అవకాశాన్ని సూర్యాపేట పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, రావు స్థానిక కౌన్సిలర్ గుణగంటి హేమ సతీష్, నిర్వాహకులు కడియం సుధాకర్, గణేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి భవనం కు భూమి పూజ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం రోజున మహిళా శక్తి భవనంకు భూమి పూజ గ్రామ సర్పంచ్ లతా శ్రీనివాస్, ఉపసర్పంచ్ దయానంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సాగర్ గౌడ్, సీసీ శ్రీనివాస్, వార్డు సభ్యులు సాయిరాం గౌడ్, దేవదాస్, వంచ సతీష్, కూడలి స్వామి, వివో ఏలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



వైభవంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

**రామారెడ్డి, రాజముద్ర,న్యూస్:** తెలంగాణ వర్కకింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం వైభవంగా ఉప్పల్వాయి గ్రామంలో నిర్వహించారు. గురజాల నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన దీరుడు కేటీఆర్ అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్వాయి గ్రామంలో టపాకాయలు పేల్చి స్వీట్లు పంపిణి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ రైతు బంధు మండల అధ్యక్షులునారాయణ రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ పార్వరెడ్డి, మాజీ సర్పంచ్ కొత్తల గంగారాం, గ్రామ అధ్యక్షులు పురం లక్ష్మణ్, సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేశారు,నాయకులు, ,మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా ఇన్స్పెక్టర్ బి ప్రమీల



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సంగారెడ్డి జిల్లా నుండి వికారాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన మహిళా ఇన్‌స్పెక్టర్ బి. ప్రమీల శుక్రవారం వికారాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహ మెహ్రాని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహిళా ఇన్‌స్పెక్టర్ బి. ప్రమీలకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, విధి నిర్వహణలో ఆదర్శవంతమైన సేవలు అందించాలని తెలిపినారు.

## కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలంలో రైతు వేదికలో శుక్రవారం రోజున కళ్యాణ లక్ష్మి చెక్కులను ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు, మండలానికి సంబంధించిన గిద్ద, ఉప్పల్వాయి, మోషన్ పూర్, గొల్లపల్లి, పోసాని పేట్, ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు వారు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆడపిల్లకు అండగా నిలుస్తాయని తెలిపారు,ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, బండి ప్రవీణ్, కిషన్ యాదవ్, దోకి లచ్చయ్య ,ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్స్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహేందర్ రెడ్డి, రవీందర్ గౌడ్, టౌన్ ప్రెసిడెంట్ నామాల రవి, మండల యూత్ ప్రెసిడెంట్ రంజిత్, ధార రాజయ్య, కను కను కంటి రాజేందర్, అంజయ్య, లింబాద్రి, శేఖర్, కాంగ్రెస్ నాయకులు, ఆర్ ఐ, అధికారులు, ,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డి నగరలో మోకిల పోలీసుల కార్డాన్ చర్చ్...

**సరైన పత్రాలు లేని 52 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు సీజ్**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్ర రెడ్డి నగర్ ఫేస్–2 లో చేవెళ్ల ఏసిపి కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు ఉదయం 5:30 గంటల నుండి 7 గంటల వరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరిగింది.ఈ కార్డెన్ సెర్చ్ లో సరియైన పత్రాలు లేని 52 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందని మోకిల పోలీసులు తెలిపారు. ఈ కార్డెన్ సెర్చ్ లో మోకిల సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐలు సురేష్ గౌడ్, సాయి కృష్ణ, పద్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన శంకర్ పల్లి మున్సిపల్ చైర్మన్

**హాజరైన కౌన్సిలర్లు, నాయకులు**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంక ర్ పల్లి మున్సిపాలిటీ 1,9,10 వ వార్డు సింగాపురంలో బూత్ నెంబర్ 54,55,56 లలో జరుగుతున్న సర్ ప్రక్రియను మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, మునిసిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రమౌళి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి గడువులోగా పూర్తి చెయ్యాలని బి ఎల్ ఏ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్వేత పాండు రంగారెడ్డి, మునిసిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రమౌళి , కౌన్సిలర్లు ఆనంద్, గణేష్, గిరిజ శేకర్, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ , బి ఎల్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## బోర్ వెల్ రీఛార్జ్ పనిని ప్రారంభించిన ఎంపీడీవో



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలో శుక్రవారం గ్రామ పంచాయితీ బోర్ నకు బోర్వెల్ రీఛార్జ్ పనిని ప్రారంభించిన ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా నిర్వహించారు. అందరికి ఉపయోగపడే పనులను సక్రమంగా వినియోగించుకోవాలని పలు పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్, ఐకేపీ ఏపీఓ ధర్మారెడ్డి, ఉప సర్పంచ్ నవీన్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఐకేపీ టిఏలు, ఎఫ్ ఎ పాల్గొన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువ ఉన్నందున ప్రతి గ్రామపంచాయతీ బోరునకు బోర్వెల్ రీఛార్జ్ పనినీ చేసుకోవాలని ఈ పని చేయడం వలన వర్షపు నీరు బోర్ లో ఇంకడం వలన నీటి సామర్థ్యం పెరుగుతుందని ఎంపీడీవో గారు తెలిపారు.






## భవ్య టాలెంట్ స్కూల్‌లో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం

**200 మందికి ఉచిత పరీక్షలు, విశేష స్పందన**

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** మియాపూర్ అల్విన్ కాలనీలోని భవ్య టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో, ఎలైట్ ఐ హాస్పిటల్, విజయ మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్స్, మదీనగూడ సంయుక్త సహకారంతో శుక్రవారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 200 మంది ఉచిత నేత్ర, దంత పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎన్. ఎస్. రావు, ప్రధానోపాధ్యాయురాలు పుష్ప సరిత, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎన్. ఎస్. రావు మాట్లాడుతూ, సమాజ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని తెలిపారు.

## కేటీఆర్ జన్మదినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

**విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పలకల పంపిణీ**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నవాబుపేట్ మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలో గ్రామ బీఆర్ఎస్ నాయకులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సందర్భంగా ఉపయోగపడే ఎగ్జామ్ ప్యాడ్లు, పలకలను పంపిణీ చేసి కేటీఆర్ జన్మదినాన్ని వినూత్నంగా, ఆదర్శప్రాయంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, కేటీఆర్ చూపిన అభివృద్ధి, సేవా స్ఫూర్తిని ప్రతి కార్యకర్త ఆచరణలో చూపాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా వారి చదువుకు చేయూతనివ్వడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని పేర్కొన్నారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం ద్వారానే ప్రజల అభిమానాన్ని పొందవచ్చని వారు అన్నారు. గ్రామ ప్రజలతో ఎల్లప్పుడూ మమేకమై, విద్య, సామాజిక సేవ, యువత సంక్షేమం వంటి అంశాల్లో ముందుండి సేవలందిస్తూ ఆదర్శ నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారని పలువురు గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు ప్రశంసించారు. అలాగే పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తూ కార్యకర్తలకు నిరంతరం మార్గదర్శకంగా నిలువలనీ తెలిపారు. విద్యార్థులు కూడా ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, పరీక్షల సమయంలో ఉపయోగపడే సామగ్రిని అందించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ గౌస్, శాంతి కుమార్, ఎల్.టి. గౌస్, శేఖర్, రాంచందర్, అనంతయ్య, నవీన్, ఆసిఫ్, ఇబ్రహీం, సందీప్, రాము, ప్రభాకర్, మల్లేశం, రాజు, శివ తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు

# పోసానిపేట్ లో వైద్య శిబిరం నిర్వహణ

**డా. ఎం. సురేష్**



**రామారెడ్డి, రాజముద్ర, న్యూస్:** రామారెడ్డి మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రామారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించరు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సుద్దాల లింగం, ఉపసర్పంచ్ ధన్న అంజయ్య, గ్రామ పాలక కార్యవర్గ సభ్యులు ప్రారంభించారు.వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించారు.శిబిరానికి హాజరైన జ్వరంతో బాధపడుతున్న ప్రతి రోగికి మలేరియా, డెంగ్యూ నిర్ధారణ కోసం రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. అదేవిధంగా అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్), మధుమేహం (డయాబెటిస్), ఆస్తమా, సీఓపీడీ, సాధారణ బలహీనత వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.శిబిరంలో గుర్తించిన కొత్త హైపర్‌టెన్షన్, మధుమేహ రోగులను ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు.ఈ వైద్య శిబిరంలో మొత్తం 98 మంది రోగులు వైద్య సేవలను పొందగా, 35 మంది రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డా. ఎం. సురేష్ మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటిని మరిగించి లేదా శుద్ధి చేసి మాత్రమే తాగాలని, జ్వరం రెండు రోజులకంటే ఎక్కువగా ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రాజమణి, హెల్త్ ఎడ్యుకేటర్ జార్జ్, ఫార్మసిస్ట్ శ్రీహరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## నేలకొండపల్లి మార్కెట్ లో రెండు గోదాముల నిర్మాణానికి ప్రతిపాదన



- మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు
- రైతులకు మరింత సౌకర్యంగా ఉండేలా చర్యలు

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం మార్కెట్ యార్డులో చైర్మన్ వెన్నపూసల సీతారాములు అధ్యక్షతన జరిగింది.3 నెలల ఆదాయం – ఖర్చుల లెక్కలుసమావేశంలో మార్కెట్ సెక్రటరీ వి. నాగేశ్వరి గత మూడు నెలల ఆదాయం, ఖర్చుల వివరాలను సభ్యుల ముందు చదివి వినిపించారు. ఆదాయం, వ్యయాలపై సభ్యులు చర్చించారు.ఈ సందర్భంగా చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడుతూ,మార్కెట్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రైతులు తమ ధాన్యం, ఇతర పంటలను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు అనువుగా ఉండేందుకు మార్కెట్ ఆవరణలో రెండు గోదాములను నిర్మించేందుకు ప్రతిపాదన చేస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వ అనుమతులు తీసుకొని పనులు ప్రారంభిస్తాం" అని అన్నారు. రైతులందరికీ మార్కెట్ సేవలు మరింత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో గౌరవ సభ్యులు సూరేపల్లి రవి, మొక్క ఉపేంద్ర, చాట్ల సత్యనారాయణ , తిప్పని సరోజిని, బానోత్ సైదా నాయక్ , పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు కృష్ణయ్య, సీతియా, మీసా నాగేశ్వరరావు తో పాటు మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



## వర్షాల కోసం మహిళల ప్రత్యేక పూజలు

- బిందెలు ఎత్తుకొని బొడ్రాయి, ముత్యాలమ్మకు జలాభిషేకం
- సకాలంలో వర్షా లు కురిసి పంటలు బాగా పండాలని మొక్కులు

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** చెన్నారం, వరుణుడు కరుణించి సకాలంలో వర్షాలు కురవాలని నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ మహిళలు వినూత్నంగా ప్రార్థనలు చేశారు.వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందిన గ్రామ మహిలలు బుధవారం తలలపై జల బిందెలు ఎత్తుకొని గ్రామంలో ప్రదర్శనగా వెళ్లారు. బొడ్రాయి, ముత్యాలమ్మకు జలాభిషేకం ప్రదర్శనగా వెళ్లిన మహిళలు గ్రామంలోని బొడ్రాయి, శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయాల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తలపై తెచ్చిన నీటితో దేవతలకు జలాభిషేకం చేసి, పూలతో అలంకరించారు. "అమ్మా ముత్యాలమ్మ తల్లి.. రైతులను ఆదుకో. వర్షాలు కురిపించి పంటలు పండేలా చూడు" అంటూ మహిళలు భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గత నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తడం లేదని, ఇప్పటికే మొలిచిన పైరులు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మహిళలు చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, రైతులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వర్షాలు కురిసే వరకు ప్రతి రోజు పూజలు చేస్తామని మహిళలు తెలిపారు.

# భేష్.. గెలిచారు!.. మరి మీ ఐదో బౌలర్ ఎవరు?



టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ఎట్టకేలకు విజయాల ఖాతా తెరిచాడు. అతడి నాయకత్వంలో జింబాబ్వేతో తొలి టీ20లో భారత్ ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా ఏడు మ్యాచ్‌ల తర్వాత శ్రేయస్ అయ్యర్ తొలిసారి గెలుపు రుచిచూశాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా గురువారం నాటి టీ20లో టాస్ గెలిచిన టీమిండియా.. జింబాబ్వేను తొలుత బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. భారత బౌలర్లు రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయిన జింబాబ్వే.. 125 పరుగులకే పరిమితమైంది.

**ఏడు వికెట్ల తేడాతో**

అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత్ మూడు వికెట్లు నష్టపోయి 13.2 ఓవర్లలోనే పని పూర్తి చేసింది. తద్వారా ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించినప్పటికీ తుదిజట్టు కూర్పుపై టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

**మరి మీ ఐదో బౌలర్ ఎవరు?**

"జట్టులో కేవలం నలుగురు బౌలర్లు.. పేసర్లు ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అశోక్ శర్మ.. స్పిన్నర్ రవి బిష్ణోయి మాత్రమే ఉన్నారు. మరి మీ ఐదో బౌలర్ ఎవరు?.. దీనికి జవాబు శివం దూబే అంటారేమో!.. మరి ఆరో బౌలర్?.. ఎవరూ లేరు. ఆరో బౌలర్ లేకుండానే టీమిండియా బరిలోకి దిగింది. నిజానికి శివం దూబే ఆల్‌రౌండర్ కదా!.. అతడు ఈసారి బంతితో కాస్త మెరుగ్గానే రాణించాడు. నాలుగు ఓవర్ల బౌలింగ్‌లో 32 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు.

**నిజంగా ఇది పెద్ద విషయమే**

మంచి క్యాచ్ కూడా పట్టాడు. ఏదేమైనా నాలుగు ఓవర్ల బౌలింగ్ కోటా పూర్తి చేయించడం ద్వారా యాజమాన్యం అతడిపై పూర్తి విశ్వాసం కనబరిచింది. నిజంగా ఇది పెద్ద విషయమే.

**సరైన నిర్ణయం**

ఇక మయాంక్ యాదవ్‌తో బౌలింగ్ ఎటాక్ ఆరంభించి కెప్టెన్ శ్రేయస్ మంచి పని చేశాడు. అశోక్ శర్మను కూడా ముందుగానే పంపించడం సరైన నిర్ణయం. ఏదేమైనా వీళ్లిద్దరిని జట్టులో చూడటం ఎంతో బాగుంది. ముఖ్యంగా మయాంక్ గాయం నుంచి కోలుకుని రెండేళ్ల తర్వాత రీఎంట్రీ ఇచ్చి సత్తా చాటాడు. నిలకడగా బౌలింగ్ చేశాడు" అని కామెంటేటర్ ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు. కాగా యూకే పర్యటనతో భారత టీ20 జట్టు కెప్టెన్‌గా శ్రేయస్ ప్రయాణం మొదలుపెట్టాడు. ఇందులో భాగంగా తొలుత ఐర్లాండ్ చేతిలో 2-0, ఇంగ్లండ్ చేతిలో 4-0తో టీమిండియా వైట్‌వాష్ అయింది.

# ప్లాన్ అదిరింది.. మెస్సీ రిటైర్మెంట్ అప్పుడే!

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ రిటైర్మెంట్‌పై ఒక స్పష్టత వచ్చింది. అర్జెంటీనా జట్టులో స్థిరత్వం వచ్చే వరకు తాను జట్టులో కొనసాగుతానని, ఆ తర్వాత కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నట్లు మెస్సీ తన అభిప్రాయాన్ని అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏఎఫ్ఏ)కు వెల్లడించినట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో 2030 ఫిఫా ప్రపంచకప్‌కు తాను అందుబాటులో ఉండనని మెస్సీనే పరోక్షంగా సంకేతాలు ఇచ్చేశాడు. రాబోయే నాలుగేళ్లలో మెస్సీతో పాటు జట్టులో ఉన్న సీనియర్ ఆటగాళ్లంతా కెరీర్‌కు గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నారు. దీంతో జట్టులో సీనియర్లంతా ఒకేసారి రిటైర్ అయితే ఆ ప్రభావం యువ ఆటగాళ్లపై ఎక్కువగా ఉంటుందని అర్జెంటీనా ఫుట్‌బాల్ తెలిపింది. అందుకోసం మెస్సీని కొంతకాలం పాటు జట్టుతో కొనసాగాలని అతడితో తెలిపినట్లు సమాచారం. దీనికి మెస్సీ కూడా ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఇక మెస్సీ వీడ్కోలు మ్యాచ్‌ను కూడా ఘనంగా ప్లాన్ చేసినట్లు అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. త్వరలోనే ఆ వివరాలు బయటికి వెల్లడిస్తామని అర్జెంటీనా ఫుట్‌బాల్ తెలిపింది. ఇక 2026 ఫిఫా ప్రపంచకప్‌లో మెస్సీ 39 ఏళ్ల వయసులోనూ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 8 గోల్స్ చేయడంతో పాటు 4 అసిస్ట్‌లతో టోర్నీలో రెండో అత్యధిక గోల్ స్కోరర్‌గా నిలిచి సిల్వర్ బూట్ అందుకున్నాడు. 10వ నంబర్ జెర్సీతో బరిలోకి దిగిన మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో రికార్డుల మీద రికార్డులు సృష్టించాడు. ఫిఫా చరిత్రలో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడిగా మెస్సీ (21 గోల్స్) రెండో స్థానంలో నిలిచాడు. తొలి స్థానంలో ఎంబాపె (ఫ్రాన్స్, 22 గోల్స్) ఉన్నాడు. ఇక రెండు దశాబ్దాల కెరీర్‌లో 2014 ఫిఫా ఫైనల్లో అర్జెంటీనా ఓటమి తర్వాత మెస్సీ ఆటకు వీడ్కోలు పలకాలనుకున్నాడు. కానీ చిన్న వయసు కావడంతో ఆలోచనను విరమించుకున్న మెస్సీ ఆ తర్వాత అర్జెంటీనాకు అద్భుత విజయాలు అందించాడు. 2021 కోపా అమెరికా కప్‌తో పాటు 2022 ఫిఫా ప్రపంచకప్‌ను అందించి అర్జెంటీనా ఖాతాలో మూడో ఫిఫా టైటిల్‌ను చేర్చాడు. 2024 కోపా అమెరికా కప్‌ను మరోసారి గెలిచిన అర్జెంటీనా 2026 ఫిఫాలో ఫైనల్ చేరినప్పటికీ తుదిమెట్టుపై బోల్తా కొట్టింది.





# సిక్సర్లతో జట్టును గెలిపించిన భారత బ్యాటర్!

హండ్రెడ్ కాంపిటీషన్ 2026లో భారత మహిళా బ్యాటర్లు రెచ్చిపోతున్నారు. తాజాగా భారత వికెట్‌కీపర్ రిచా ఘోష్ రెండు భారీ సిక్సర్లతో తన జట్టును విజయతీరాలకు చేర్చడం మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది. 81 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మాంచెస్టర్ రిచా ( 5 బంతుల్లో 15 నాటౌట్, రెండు సిక్సర్లు) ధాటికి 59 బంతుల్లోనే ఛేదించి 7 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. మిగిలినవారిలో పేజ్ స్కోఫీల్డ్ (15 బంతుల్లో 22 నాటౌట్), మెగ్ లానింగ్ (24 బంతుల్లో 21) రాణించారు. అంతకముందు లండన్ స్పిరిట్ వుమెన్ 91 బంతుల్లో 80 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ చార్లెట్ డీన్ (14), చారిస్ పవెలి (13) పర్వాలేదనిపించారు. మాంచెస్టర్ బౌలర్లలో రియానా మెక్‌డొనాల్డ్ 4 వికెట్లతో సత్తా చాటింది. ఇక పురుషుల క్రికెట్‌లో మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ ఏడు పరుగుల తేడాతో లండన్ స్పిరిట్‌పై విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన మాంచెస్టర్ 100 బంతుల్లో 9 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. టిమ్ సిఫెర్ట్ (45 బంతుల్లో 67) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం లండన్ నైట్స్ 100 బంతుల్లో 6 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది. లివింగ్ స్టోన్ (40 బంతుల్లో 69 నాటౌట్) అజేయంగా నిలిచినప్పటికీ జట్టును గెలిపించకలేకపోయాడు.

# డీఎస్పీలుగా భారత క్రికెటర్లు



టీమిండియా ఫాస్ట్ బౌలర్లు ముఖేష్ కుమార్, ఆకాష్ దీప్‌లకు అరుదైన గౌరవం దక్కింది. ఈ ఇద్దరు క్రికెటర్లను బీహార్ ప్రభుత్వం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) హోదాతో సత్కరించింది. పాట్నాలోని 'ఎనర్జీ ఆడిటోరియం'లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బీహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి వీరిద్దరికీ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ అంతర్జాతీయ స్థాయిలో బీహార్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారని సమ్రాట్ చౌదరి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, క్రీడా శాఖ మంత్రి శ్రేయసి సింగ్‌లు కూడా పాల్గొన్నారు. కాగా ముకేష్, ఆకాష్ దీప్ బీహార్‌లో జన్మించినప్పటికి దేశవాళీ క్రికెట్‌లో మాత్రం బెంగాల్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ముఖేష్ కుమార్ 2023లో వెస్టిండీస్ పర్యటనలో భాగంగా టీమిండియా తరఫున అరంగేట్రం చేశాడు. ఇదే టూర్‌లో మొత్తం మూడు ఫార్మాట్‌లలోనూ డెబ్యూ చేశాడు. అయితే అతడు నిలకడగా రాణించకపోవడంతో జాతీయ జట్టులో చోటు కోల్పోయాడు. కానీ దేశవాళీ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లో మాత్రం ఫర్వాలేదన్పిస్తున్నాడు. అతడు ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 10 మ్యాచ్‌లు ఆడి 6 వికెట్లు పడగొట్టాడు. ఇక ఆకాష్‌దీప్ విషయానికి వస్తే.. అతడు భారత టెస్ట్ జట్టులో కీలక సభ్యునిగా ఉన్నాడు. అయితే ప్రస్తుతం వెన్ను గాయంతో బాధపడతుండంతో ఆకాష్ పోటీ క్రికెట్ దూరం కానున్నాడు. ఈ గాయం కారణంగా ఐపీఎల్ 2026 నుంచి కూడా అతడు వైదొలిగాడు.

**క్రీడకారులకు అండగా బీహార్**

కాగా గత కాలంగా బీహార్ ప్రభుత్వం క్రీడకారులకు అండగా ఉంటుంది. ఇప్పటివరకు క్రీడా కోటా కింద దాదాపు 180 మంది అథ్లెట్లకు వేర్వేరు ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు కల్పించింది. సమ్రాట్ చౌదరి సర్కార్ ఈ ఏడాది 637 మందికి స్కాలర్‌షిప్‌లతో పాటు 'సక్షమ్' పథకం కింద ₹3 లక్షలు, 'ఉత్కర్ష్' పథకం కింద ₹5 లక్షల నుండి ₹20 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు.

# వెస్టిండీస్‌కు భారీ షాక్.. ఎగిరి గంతేస్తున్న పాకిస్తాన్!



స్వదేశంలో పాకిస్తాన్‌తో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన తమ జట్టును వెస్టిండీస్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ జట్టుకు రోస్టన్ ఛేజ్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, జోమెల్ వారియోకన్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేస్తున్న లెఫ్ట్ ఆర్మ్ ఆర్థడాక్స్ స్పిన్నర్ జోషువా బిషప్ తొలిసారిగా విండీస్ టెస్ట్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 26 ఏళ్ల బిషప్ గడిచిన మూడు వెస్టిండీస్ ఛాంపియన్‌షిప్ సీజన్లలో ఏకంగా 91 వికెట్లు పడగొట్టి సత్తాచాటాడు. ఈ క్రమంలోనే అతడికి సెలక్టర్లు పిలుపునిచ్చారు. గడిచిన మూడు వెస్టిండీస్ ఛాంపియన్‌షిప్ సీజన్లలో ఈయన 91 వికెట్లు తీసి అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన లెఫ్ట్ ఆర్మ్ ఆర్థడాక్స్ స్పిన్నర్ జోషువా బిషప్ తొలిసారిగా విండీస్ టెస్టు జట్టులోకి పిలుపు అందుకున్నాడు. అదేవిధంగా న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో తొడకండరాల గాయానికి గురైన ఓపెనర్ జాన్ కాంప్‌బెల్.. పాక్‌తో టెస్టులకు దూరమయ్యాడు. అతడి స్థానంలో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ కిర్క్ మెకెంజీకి సెలక్టర్లు అవకాశమిచ్చారు. మరోవైపు స్టార్ పేసర్ అల్జారీ జోసెఫ్ వ్యక్తిగత కారణాలతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. ఇది నిజంగా కరేబియన్ జట్టుకు గట్టి ఎదురు దెబ్బే అనే చెప్పాలి. జోషఫ్ వంటి స్టార్ బౌలర్ జట్టులో లేకపోవడంతో విండీస్ గడ్డపై పాక్ బ్యాటర్లు పండగ చేసుకోనున్నారు. కాగా ఆల్‌రౌండర్ కిమో పాల్ తిరిగి జట్టులోకి వచ్చాడు. కేమర్ రోచ్, జేడెన్ సీల్స్, షమర్ జోసెఫ్‌లు ఫాస్ట్ బౌలర్లగా ఉన్నారు. ఈ సిరీస్‌లోని మొదటి టెస్టు మ్యాచ్ జూలై 25 నుంచి 29 వరకు టారోబాలోని 'బ్రియన్ లారా క్రికెట్ అకాడమీ' మైదానంలో జరగనుంది. ఈ వేదికపై అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ జరగనుండడం ఇదే తొలిసారి కావడం విశేషం.



# నేనింకా పిల్లాడినే.. అందుకు అర్హుడిని కాను: వైభవ్

జింబాబ్వేతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. తొలి టీ20 మ్యాచ్‌లో బౌలర్లు రాణించగా, ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ మెరుపు ఫిఫ్టీ సాధించడంతో టీమిండియా సునాయాస విజయాన్ని అందుకుంది. అయితే మ్యాచ్ విజయంలో తన పాత్రేమి లేదని, నిజానికి బౌలర్లే మ్యాచ్ విన్నర్లంటూ వైభవ్ పేర్కొన్నాడు. తానింకా నేర్చుకునే దశలోనే ఉన్నానని.. గెలుపునకు అర్హుడిని కాదని వెల్లడించాడు. మ్యాచ్ విజయం తర్వాత బీసీసీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వైభవ్ మాట్లాడుతూ.. 'కెరీర్ ప్రారంభంలో ఇలాంటి ఇన్నింగ్స్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా గొప్పగా బ్యాటింగ్ చేయడానికే ప్రయత్నిస్తాను. జట్టు కోసం ఎప్పుడూ నా బెస్ట్ ఇచ్చేందుకే కష్టపడుతుంటా. జింబాబ్వేపై విజయంలో నేను క్రెడిట్ తీసుకోలేను. దానికి నేను అర్హుడిని కాను. నేనింకా నేర్చుకునే దశలోనే ఉన్నా' అని వైభవ్ చెప్పుకొచ్చాడు. ఇక మ్యాచ్‌లో ఫిఫ్టీ అనంతరం చేతి వేళ్లలో 'A' అక్షరం చూపిస్తూ సెలబ్రేషన్ చేసుకోవడంపై కూడా వైభవ్ వివరణ ఇచ్చాడు. "'A' అనేది మా అమ్మ పేరులో మొదటి అక్షరం. నా హాఫ్ సెంచరీ సెలబ్రేషన్‌ను అందుకే A సంకేతంతో చూపించాను. నా కెరీర్‌లో సాధించిన తొలి అంతర్జాతీయ అర్ధసెంచరీని నా కుటుంబానికి, కోచ్‌లతో పాటు నా జర్నీలో సహకరించిన ప్రతీ ఒక్కరికి ఈ ఇన్నింగ్స్‌ను అంకితమి స్తున్నా.' అని వెల్లడించాడు. హరారే వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులకు పరిమితమైంది. అనంతరం భారత్ 13.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. వైభవ్ 19 బంతుల్లో ఫిఫ్టీ సాధించగా, ఇషాన్ కిషన్ 35 పరుగులు చేశాడు. ఆఖర్లో శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్) జట్టును గెలిపించాడు. ఇరుజట్ల మధ్య రెండో టీ20 శనివారం జరగనుంది.

# కామన్వెల్త్ గేమ్స్‌లో 100% ఎఫర్ట్ పెట్టను.. ఎందుకంటే?: మీరాబాయి చాను



కామన్వెల్త్ గేమ్స్ 2026లో తాను వంద శాతం ఎఫర్ట్ పెట్టనని భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తెలిపింది. సెప్టెంబరు 19 నుంచి ప్రారంభంకానున్న ఆసియా క్రీడలపైనే తన దృష్టంతా అని స్పష్టం చేసింది. ఆ క్రీడల కోసం తన శక్తిని కాపాడుకోవడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆసియా క్రీడల్లో తొలి పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపింది. ఈ సారి కామన్వెల్త్ గేమ్స్ లో మీరాబాయి చాను 48 కేజీల విభాగంలో బరిలోకి దిగుతోంది. ఆసియా క్రీడలకు రెండునెలల కన్నా తక్కువ సమయమే ఉండటంతో.. రిస్క్ చేయొద్దనే ఉద్దేశంతో 90 కేజీల స్నాచ్‌కు దూరంగా ఉంది. "కామన్వెల్త్ గేమ్స్‌లో నేను నా పూర్తి ప్రయత్నం చేయను. నా దృష్టి అంతా అతి త్వరలో జరగనున్న ఆసియా గేమ్స్‌పైనే. అందుకు అనుగుణంగానే శిక్షణ పొందుతున్నాను. కామన్వెల్త్ గేమ్స్‌లో నా ప్రదర్శన, ప్రయత్నం ఆ ప్రణాళికపైనే ఆధారపడి ఉంటాయి. ఒక నిర్దిష్ట రోజున శరీరం ఎలా స్పందిస్తుందో నిజంగా అంచనా వేయలేం. ఆసియా క్రీడల్లో 90 కేజీల బరువు ఎత్తడానికి తప్పకుండా ప్రయత్నిస్తాను. పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టినప్పటి నుంచి నేను 48 లేదా 49 కిలోల బరువును మాత్రమే కొనసాగిస్తూ వస్తున్నాను. బరువును అదుపులో ఉంచుకోవడం చాలా కష్టమైన విషయం. ఎన్నో అంశాలపై నిరంతరం దృష్టిసారించాల్సి ఉంటుంది. ఒక అథ్లెట్ జీవితంలో సగం సమయం దీనికే ఖర్చవుతుంది" అని చాను పేర్కొంది. లాస్ ఏంజెలెస్ 2028 క్రీడలకు ముందు ఒలింపిక్ వెయిట్ కేటగిరీలలో (బరువు విభాగాలలో) జరిగిన మార్పుల నేపథ్యంలో ఆసియా క్రీడల తర్వాత తాను 53 కిలోల విభాగంలోకి మారాలని భావిస్తున్నట్లు చాను వెల్లడించింది. టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు, కామన్వెల్త్ గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాలను సాధించిన చాను.. ఆసియా క్రీడల్లో మాత్రం ఒక్క మెడల్ గెల్చుకోలేకపోయింది.

# భారత్‌లో యాషెస్ టెస్టు మ్యాచ్!



ఇండియా, ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే బిగ్ బాష్ లీగ్ 2026 నేపథ్యంలో తొలి మ్యాచ్ చెన్నైలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మేరకు ఇప్పటికే ప్రకటన కూడా వచ్చింది. అయితే యాషెస్ సిరీస్ మ్యాచ్ లు కూడా ఇండియాలో జరిగే అవకాశాలు ఉన్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ యాషెస్ సిరీస్ లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు తలపడతాయి. వాస్తవానికి ఈ టోర్నమెంట్ జరిగితే, ఆస్ట్రేలియా లేదా ఇంగ్లాండ్ లో నిర్వహించాలి. కానీ త్వరలో జరగబోయే యాషెస్ సిరీస్ ను ఇండియాలో నిర్వహించేలా సన్నద్ధం అవుతున్నారట. ఈ మేరకు క్రికెట్ ఆస్ట్రేలియా పరిశీలన చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్ బర్గ్ మాట్లాడుతూ ఇండియాలో యాషెస్ సిరీస్ నిర్వహించడంపై అన్ని ఆప్షన్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఇంగ్లాండ్ తో పాటు బీసీసీఐతో కూడా తమకు మంచి సంబంధాలు ఉన్నాయని వివరించారు. ఇండియాలో యాషెస్ సిరీస్ నిర్వహించే దానిపైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కుదిరితే కచ్చితంగా జరుగుతుందని వివరించారు. యాషెస్ సిరీస్ లో ఒక్క టెస్ట్ అయినా నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నట్లు వివరించారు.

## ప్రీమియర్స్ తో 3 కోట్లు కొల్లగొట్టిన

# చెన్నై లవ్ స్టోరీ




హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన "చెన్నై లవ్ స్టోరీ" సినిమా పెయిడ్ ప్రీమియర్స్ తోనే బాక్సాఫీస్ వద్ద రికార్డ్స్ క్రియేట్ చేస్తోంది. పెయిడ్ ప్రీమియర్స్ ద్వారా లవ్ స్టోరీ మూవీస్ లో ఏ సినిమాకు రానంత కలెక్షన్స్ రాబట్టిందీ మూవీ. "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు పెయిడ్ ప్రీమియర్స్ ద్వారా 3.13 కోట్ల రూపాయల వసూళ్లు రావడం విశేషం. పెయిడ్ ప్రీమియర్స్ నుంచే బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకున్న "చెన్నై లవ్ స్టోరీ" సినిమా..ఫస్ట్ డే ఫస్ట్ షోతో పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంటోంది. ఈ లెక్కన బాక్సాఫీస్ వద్ద "చెన్నై లవ్ స్టోరీ" సినిమా సక్సెస్ ఫుల్ జర్నీ బిగిన్ చేసింది. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేష్ నిర్మించారు. సాయి రాజేష్ కథను అందించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించారు.

# 'కపాలి'తో సర్‌ప్రైజ్ ఇచ్చిన నారా రోహిత్..

టాలీవుడ్ హీరో నారా రోహిత్ మరో కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'కపాలి' (Kapaali) అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రకటిస్తూ, "A journey into the UNKNOWN begins here.." అంటూ క్యాప్షన్‌ను పంచుకున్నారు. ఈ అనౌన్స్‌మెంట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి గన్ని రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. నార్మల్ కథలతో కాకుండా విభిన్న స్టోరీలతో సినిమాలు చేస్తున్న నారా రోహిత్ మరోసారి కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది. పోస్టర్‌లో కనిపించిన థీమ్‌ను బట్టి ఈ చిత్రం మిస్టరీ, థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

ఈ సినిమాను విజయ్ కృష్ణ లింగమనేని, కల్యాణ్ మంతిన, భాను ప్రతాప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎస్ఏఎమ్‌డబ్ల్యూతో (SAMW) కలిసి ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక బృందం, షూటింగ్ షెడ్యూల్, విడుదల తేదీ వంటి పూర్తి వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. విభిన్న కథలను ఎంచుకోవడంలో పేరుగాంచిన నారా రోహిత్, 'కపాలి'తో మరోసారి ప్రేక్షకులను సరికొత్త అనుభూతికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారని చెబుతున్నారు. ఈ అనౌన్స్‌మెంట్‌తో సినిమాపై అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.




## సెట్స్‌పైకి మణిరత్నం

# డ్రీమ్ ప్రాజెక్ట్..

### ఒకే ఫ్రేమ్‌లో సాయి పల్లవి-విజయ్ సేతుపతి!





దిగ్గజ దర్శకుడు మణిరత్నం మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కించే పనిలో పడ్డారు. ఈ చిత్రంలో తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి, స్టార్ హీరోయిన్ సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్ కోల్‌కతాలో జరుగుతోందట. తాజాగా హీరో విజయ్ సేతుపతి కూడా షూటింగ్‌లో పాల్గొన్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కోల్‌కతా షెడ్యూల్ దాదాపు రెండు వారాల పాటు కొనసాగనుందని, అనంతరం షూటింగ్‌ను పుదుచ్చేరికి మార్చనున్నట్లు తెలుస్తోంది. స్టోరీకి అనుగుణంగా విభిన్న లొకేషన్లలో షూటింగ్ చేపట్టేందుకు మణిరత్నం ప్రత్యేక ప్లాన్స్‌తో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ప్రాజెక్ట్‌కు మరో హైలెట్‌గా మ్యూజిక్ నిలవనుందని చెబుతున్నారు. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారని సమాచారం. మణిరత్నం – ఏ.ఆర్.రెహమాన్ కాంబినేషన్ గతంలో ఎన్నో సంగీత సంచనాలను సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కొత్త మూవీ కోసం మళ్లీ ఈ ఇద్దరూ కలిసి పని చేయబోతుండటంతో ఈ సినిమాపై మ్యూజిక్ లవర్స్‌లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్, రిలీజ్ తేదీలను ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.



# టాక్సిక్ సెన్సార్ కష్టమేనా?

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా డైరెక్టర్ గీతు మోహన్‌దాస్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'. ఈ సినిమా రిలీజ్‌కు ముందే భారీ చర్చకు దారితీసింది. సినిమా నుంచి విడుదలైన ప్రతి గ్లింప్స్, టీజర్, పాట సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే తీవ్ర విమర్శలకు కూడా కారణమవుతోంది. ముఖ్యంగా సినిమాలోని హింసాత్మక సన్నివేశాలు, రొమాంటిక్ విజువల్స్‌పై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. టీజర్, గ్లింప్స్ విడుదలైనప్పటి నుంచి దర్శకురాలు గీతు మోహన్‌దాస్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హాలీవుడ్ తరహా హింస, బోల్డ్ రొమాన్స్‌ను చూపిస్తున్నారంటూ కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విమర్శలను పట్టించుకోకుండా చిత్ర బృందం వరుసగా ప్రమోషనల్ కంటెంట్‌ను రిలీజ్ చేస్తోంది.

ఇప్పటివరకు రిలీజ్ అయిన ప్రమోషన్ వీడియోల్లో యశ్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేసిన గ్లింప్స్, అనంతరం వచ్చిన టీజర్, అలాగే పాటల్లోని కొన్ని రొమాంటిక్, ఇంటిమేట్ విజువల్స్ ప్రేక్షకుల్లో భిన్నాభిప్రాయాలకు కారణమయ్యాయి. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో కనిపించిన హింసాత్మక షాట్లు, అలాగే కియారా అద్వానీతో వచ్చిన 'తబాహీ' పాట సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. ఈ సినిమాలో యశ్ సరసన నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు హీరోయిన్లతో సంబంధించిన పాటలు రిలీజ్ కాగా, మిగిలిన పాటలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో చిత్ర నిర్మాత వెంకట్ కె.నారాయణ తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జన నాయగన్ సినిమా ప్రమోషన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'టాక్సిక్ సాధారణ సినిమా కాదు. ఇది పూర్తిగా పెద్దల కోసం తెరకెక్కించిన కల్పిత కథ. ప్రేక్షకులు ఈ సినిమాను ఆ కోణంలో చూస్తే తప్పకుండా ఆస్వాదిస్తారు' అని స్పష్టం చేశారు. అలాగే సినిమా రిలీజ్ తర్వాత ప్రేక్షకులు దీనిని ప్రత్యేకమైన చిత్రంగా అభినందిస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నిర్మాత కామెంట్స్‌తో ఈ సినిమాపై జరుగుతున్న చర్చకు మరింత ఊపు వచ్చింది. స్కై హై అంచనాల మధ్య ఉన్న 'టాక్సిక్' మూవీకి 'టాక్సిక్'కి సెన్సార్ కష్టమేనా? అనే టాక్ కూడా వినిపిస్తోంది. చూడాలి మరి ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఎలాంటి సంచలనాలను సృష్టిస్తుందో.

# డెనిమ్ శారీలో ఫరియా అబ్దుల్లా..

నటి ఫరియా అబ్దుల్లా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. 'డ్యాన్స్ ఐకాన్ సీజన్ 2' కార్యక్రమంలోని ఓ ఎపిసోడ్ కోసం ఆమె డెనిమ్ శారీలో సందడి చేసింది. ట్రెండీ డెనిమ్ చీరకు మోడ్రన్ స్టైలింగ్‌ను జోడించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ లుక్‌కు సంబంధించిన ఫోటోలను ఫరియా తన సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకోగా, అవి క్షణాల్లోనే వైరల్‌గా మారాయి. డెనిమ్ శారీలో ఆమె స్టైల్, గ్లామర్ అభిమానులను ఆకట్టుకుంటుండగా, నెటిజన్లు "శారీ సూపర్", "లుక్ అదిరిపోయింది", "ఫ్యాషన్‌కు కొత్త ట్రెండ్" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.ప్రస్తుతం ఫరియా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.





# రిలీజ్‌కు ముందే వరుణ్ తేజ్ జాక్‌పాట్..

## 'కొరియన్ కనకరాజు' రూ.26 కోట్ల బిజినెస్?

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కిన ఇండో-కొరియన్ హారర్ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. ఈ సినిమా రిలీజ్‌కు ముందే ట్రేడ్ వర్గాల్లో మంచి హైప్‌ను సొంతం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ఇప్పటికే నాన్-థియేట్రికల్ రైట్స్ ద్వారానే సుమారు రూ.26 కోట్ల ఆదాయాన్ని రాబట్టినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సుమారు రూ.38 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి రిలీజ్‌కు ముందే అదిరిపోయే బిజినెస్ జరగడం విశేషం. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, పాటలు ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకోవడంతో ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది. హారర్, కామెడీ అంశాలతో రూపొందిన ఈ ఇండో-కొరియన్ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఇక థియేట్రికల్ బిజినెస్ కూడా ప్రీమియం రేట్లకే జరుగుతున్నట్లు సమాచారం. పలు ఏరియాల్లో డిస్ట్రిబ్యూషన్ రైట్స్‌కి మంచి డిమాండ్ కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో సినిమా రిలీజ్ తర్వాత ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ వస్తే బాక్సాఫీస్ వద్ద బ్రేక్‌ఈవెన్ సాధించడం పెద్ద కష్టమేమీ కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాన్-థియేట్రికల్ రికవరీ, థియేట్రికల్ బిజినెస్‌కు వస్తున్న స్పందన, రిలీజ్‌కి ముందే ఏర్పడిన బజ్ వంటి అంశాలు 'కొరియన్ కనకరాజు'కు పెద్ద ప్లస్‌గా మారాయని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రం రిలీజ్ తర్వాత ప్రేక్షకులను ఎంత మేర ఆకట్టుకుంటుందో చూడాలి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com